
సమీక్షా సమావేశంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

మద్యం, డబ్బు, డ్రగ్స్ పంపిణీని అరికట్టాలి : సీపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి, మద్యం, డబ్బు, డ్రగ్స్ పంపిణీని అరికట్టాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బందోబస్తు, ఎన్నికల ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, వికారాబాద్ జిల్లా ప్రభుత్వ అధికారులతో గచ్చిబౌలిలోని కమిషనరేట్‌లో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, వికారాబాద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువును సుందరీకరిస్తాం


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని, మురికికూపాలుగా మారిన చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనుల్లో భాగంగా జరుగుతున్న మురుగునీటి మళ్లింపు పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నాం : కార్పొరేటర్


భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాన్, జీహెచ్ భాస్కర్, మల్లేష్, నాగరాజు, సాయిగౌడ్, కేబుల్ సాయి తదితరులు పాల్గొన్నారు.


అంజలియాదవ్‌కు నియామకా పత్రాన్ని అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కాంగ్రెస్ మహిళా సేవాదళ్ సెక్రటరీగా అంజలి

గాజులరామారం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా సేవాదళ్ సెక్రటరీగా గాజులరామారం డివిజన్ కైలాస్‌హిల్స్‌కు చెందిన గంగుల అంజలియాదవ్ నియమితులయ్యారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్జీ దేశాయ్, తెలంగాణ ప్రదేశ్ మహిళా సేవాదళ్ మహిళా చీఫ్ భవాని త్రివేదీ అంజలిని నియమించారు. ఈ నియామకపత్రాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆయన పార్టీ ఆఫీసులో గురువారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు బలిరెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బోరు

నిజాంపేట్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో కాలనీవాసుల సౌకర్యార్థం హిందూ శ్మశానవాటికలో బోరు వేయడానికి సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పనులు ప్రారంభించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ బోరును కాంగ్రెస్ పార్టీ స్పెషల్ ఫండ్ ద్వారా వేస్తున్నామన్నారు. అదేవిధంగా సీసీ రోడ్డు పనులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ నగర్ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్వశక్తితో ఎదగాలి

గచ్చిబౌలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని స్వశక్తితో ఎదిగి, సమాజానికి సేవలు అందించినప్పుడే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు వస్తాయని సంస్కృతి పాఠశాలల చైర్మన్ లక్ష్మణ్‌రావు అన్నారు. కొండాపూర్‌లోని సంస్కృతి పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, లక్ష్మి, దీప్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మున్నూరు కాపు కార్పొరేషన్' హర్షణీయం

షాపూర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బూరుగుబావి హన్మంతరావు అన్నారు. గురువారం జిల్లా విభజన జిల్లా అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు కార్పొరేషన్ ప్రకటన పట్ల తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కొండా సురేఖ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పబ్లిసిటీ కార్యదర్శి సాయిని శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సంఘ నాయకులు పాల్గొన్నారు.

'రెడ్డి కార్పొరేషన్' నిర్ణయంపై హర్షం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద రెడ్ల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆ సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాముని నర్సింహారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని కులాల్లో మాదిరిగానే రెడ్లలో కూడా పేదలు ఉన్నారని, వారిని ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందన్నారు. జిల్లా తరపున, రెడ్డి సంఘం తరపున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి చాక్లెట్స్ విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

జీడిమెట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రామిరెడ్డినగర్‌లో గంజాయి చాక్లెట్లు, నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న ఓ యువకుడిని బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.11,500 విలువైన 150 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన సిబూకుమార్(19) జీడిమెట్ల రామిరెడ్డినగర్‌లో కిరాణాషాప్ నిర్వహిస్తున్నాడు. షాప్‌లో నిషేధితగంజాయి చాక్లెట్లు, సిగరెట్లు విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని విద్యార్థి మృతి


అఖిలేష్ మృతదేహం

చందానగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శక్తిఅఖిలేష్(20) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తెల్లాపూర్ నుంచి నెహ్రూనగర్‌కు ఇద్దరు మిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. రామయ్యనగర్ నుంచి బీహెచ్‌ఈఎల్‌కు హిమబిందు, కీర్తిశంకర్ దంపతులు వస్తున్నారు. ఓల్డ్ ఎంఐజీ సాయిబాబా గుడి దగ్గర అఖిలేష్ అతివేగంతో అదుపుతప్పి కీర్తిశంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అఖిలేష్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు. అతనితోపాటు బైక్‌పై ఉన్న ఓ మిత్రుడికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'పోతన భాగవతం- అలంకార శిల్పం' ఆవిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పిల్లలమర్రి రాములు, దార్ల వెంకటేశ్వరరావు, గ్రంథ రచయిత డాక్టర్ గొట్టే శ్రీనివాసరావు

రాయదుర్గం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అలంకార శాస్త్రంపై పరిమితంగా పరిశోధనలు జరుగుతున్న ఈ కాలంలో పోతన రాసిన మహాభాగవతంలో అలంకార శిల్పం గురించి పరిశోధన చేయడం ఎంతో విశేషమైన కృషి అని ఆచార్య పిల్లలమర్రి రాములు వ్యాఖ్యానించారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ గొట్టే శ్రీనివాసరావు తన పరిశోధన గ్రంథం పోతన భాగవతం- అలంకార శిల్పంను గురువారం హెచ్‌సీయూలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహాకావ్యమైన ఆంధ్ర మహాభాగవతంపై పరిశోధన చేయడమే ఒక విశేషమయితే దానిలోని అలంకారాలపై అధ్యయనం చేయడం అత్యంత ప్రశంసనీయమని అన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ గొట్టే శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను చదువుకుని పరిశోధన చేసిన తెలుగుశాఖలోనే తన పర్యవేక్షకుడితో తన గ్రంథం ఆవిష్కరణ కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎం.గోనానాయక్, ఆచార్య షమ్మి పవన్‌కుమార్, ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య పి.వారిజారాణి, ఆచార్య త్రివేణి వంగరి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి.విజయకుమారి, డాక్టర్ లచ్చయ్య, డాక్టర్ భగ్యనాయక్ పాల్గొన్నారు.


బీఆర్ఎస్ నాయకుడు బట్ట అనిల్‌కుమార్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మాధవరం కాంతారావు

బీజేపీలో చేరిక

కూకట్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల సుపరిపాలనకు ఆకర్షితులై బీజేపీలో చేరేందుకు ఇతర పార్టీల నాయకులు ఆసక్తి చూపుతున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బట్ట అనిల్‌కుమార్ గురువారం కాంతారావు సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ... బీజేపీలో చేరికల పర్వం కొనసాగుతోందన్నారు. బీజేపీలో చేరేందుకువివిధ పార్టీలకు చెందిన అనేక మంది నాయకులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు షేక్ షాజహన్, వినోద్‌కుమార్‌గౌడ్, బాల నారాయణ, సంతోష్, హరి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


నగదు పురస్కారం అందుకున్న విద్యార్థులతో కాంగ్రెస్ నేత రమేష్

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం

బాలానగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను పెద్దలు, తల్లిదండ్రుల పట్ల గౌరవమర్యాదలను అలవరచుకోవాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ విద్యార్థులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు పులి శ్రీకాంత్‌పటేల్‌గౌడ్ తల్లి పులి ఆండాలమ్మ పటేల్ వర్ధంతి సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో బాలానగర్ జిల్లా పరిషత్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. గతేడాది 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్న విద్యార్థులకు నగదు పురస్కారాలను, 9 వతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు పుష్పారెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, దినేష్‌కుమార్, సతీష్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్, పులి శ్రీకాంత్‌గౌడ్, రవిముదిరాజ్, హెచ్‌ఎం అరుణ్‌జ్యోతి, ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై టిప్పర్, లారీ ఢీ.. ఒకరు మృతి


ప్రభు(ఫైల్)


రాయదుర్గం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వట్టినాగులపల్లి వద్ద ఔటర్‌రింగ్ రోడ్డుపై గురువారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఖాజీపల్లి నుంచి నార్సింగ్ వైపు వెళ్తున్న టిప్పర్ వట్టినాగులపల్లి వద్ద రింగ్‌రోడ్డుపైకి రాగానే ముందుటైర్ పగిలిపోవడంతో ఆ టిప్పర్ పక్కనే ఉన్న సబ్‌స్టేషన్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో కేరళకు చెందిన లారీడ్రైవర్ స్పీడుగా దూసుకొచ్చి టిప్పర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీడ్రైవర్ ప్రభు(32) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుండిగల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి షట్టర్ ముందు శవమై కనిపించాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డు వద్ద అంకిబోయిన అంజియాదవ్‌కు వ్యాపారం నిమితం షట్టర్ ఉంది. షట్టర్ ముందు వాచ్‌మ్యాన్‌గా అంజియాదవ్ చంద్రయ్యను నియమించాడు. బుధవారం సాయంత్రం వాచ్‌మ్యాన్ యజమానికి ఫోన్‌చేసి షట్టర్ ఎదురుగా ఒక వ్యక్తి పడి ఉన్నాడని చెప్పాడు. వెంటనే అక్కడికి చేరుకున్న యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. చుట్టు పక్కల వారిని విచారించగా, హోటళ్లలో అడుక్కునే వ్యక్తి అని పోలీసులకు స్థానికులు తెలిపారు. అంజియాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

హోర్డింగ్ పై వ్యక్తి హల్‌చల్


వ్యక్తిని క్రేన్‌తో క్రిందకు దించుతున్న పోలీసులు

దుండిగల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి హోర్డింగ్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సూరారం ప్రధాన రహదారిపై జ్యోతి డైరీ వద్ద ఉన్న హోర్డింగ్‌పైకి ఎక్కిన వ్యక్తి కిందకు దూకబోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అతనికి నచ్చజెప్పినా వినలేదు. దీంతో క్రేన్‌సహాయంతో అతన్ని పోలీసులు కిందకు దించారు. అనంతరం మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రామ్‌దేవ్‌రావు ఆస్పత్రిలో కిడ్నీ దినోత్సవం


రామ్‌దేవ్‌రావు ఆస్పత్రిలో నిర్వహించిన కిడ్నీ దినోత్సవంలో వైద్యులు, సిబ్బంది

కూకట్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని గురువారం కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. కిడ్నీ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని డా.ఛాయదేవి సూచించారు. కార్యక్రమంలో మేరి డేవిడ్, అఖిల, శోభ, డా.రంగనాథ్, లావణ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.



మలేషియన్‌టౌన్‌షిప్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ సీఈవో శ్రీరామ్ అయ్యర్ అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేపీహెచ్‌బీ మలేషియన్‌టౌన్‌షిప్‌లోఅపోలో డయాలసిస్ క్లినిక్స్ ఆధ్వర్యంలో గురువారం మాస్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను శ్రీరామ్ ప్రారంభించారు. మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటూ కిడ్నీలను కాపాడుకోవాలని సూచించారు.


వైశ్యయూత్ అసోసియేషన్ సభ్యులు, అభ్యుదయ స్కూల్ విద్యార్థులతో ట్రాఫిక్ ఏసీపీ శంకర్

సామాజిక సేవ చేసేందుకు ఏ పదవీ అవసరం లేదు : ట్రాఫిక్ ఏసీపీ

ఓల్డుబోయినపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ చేసేందుకు పదవులు, రాజకీయ పలుకుబడి అవసరం లేదని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ అన్నారు. బోయినపల్లి హస్మత్‌పేట అభ్యుదయ ప్రత్యేక పాఠశాలకు చెందిన చెవిటి, మూగ పిల్లల కోసం గ్రేటర్ వైశ్య యూత్ అసోసియేషన్ సభ్యుల సౌజన్యంతో నిర్మించిన షెడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధానకార్యదర్శి పి.కార్తీక్‌కుమార్, కోశాధికారి వెంకటేష్, ప్రాజెక్ట్ చైర్మెన్ కోటేశ్వర్‌రావు ఇడిమిశెట్టి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన యువజన నేత



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సత్యం

అల్లాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ సీనియర్ యువజన నాయకుడు వేముల సత్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో సత్యం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రాబోవు ఎంపీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో చలివేంద్రం ప్రారంభం

మియాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షుడు ఆరెపల్లి సాంబశివగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా రామలింగ ప్రసాద్, ఎస్సై దశరథ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మోసిన్‌ఖాన్, అడ్వైజర్ ఎండీ సాజిద్‌అలీ, ఉపాధ్యక్షుడు సయ్యద్, ఎండీ సాబీర్, నరసింహారావు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ డైరెక్టర్‌కు అభినందనలు



జేఎన్‌టీయూ అటానమస్ కాలేజ్ అఫైర్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డా.బి.రవీందర్‌రెడ్డికి గురువారం రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ అరుణకుమారి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

\- జేఎన్‌టీయూ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)

పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం


పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ సత్యలక్ష్మీనగర్ పాస్టర్ వందన ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని, కుల మతాలకు అతీతంగా అన్ని మతాలను గౌరవించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్‌గౌడ్, ఇలియస్‌షరీఫ్, రఘునందన్‌రెడ్డి, నల్ల సంజీవరడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి...

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం అపర్ణసైబర్ క్లబ్‌హౌస్, గచ్చిబౌలి, లింగంపల్లి, భారతినగర్ డివిజన్‌లో ముఖ్యకార్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుదామని తెలిపారు.


భగత్‌సింగ్ విగ్రహ ఆవిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భగత్‌సింగ్ విగ్రహం ఆవిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ భగత్‌సింగ్ ఫేజ్-1లో నూతనంగా ఏర్పాటుచేసిన షహీద్ భగత్‌సింగ్ విగ్రహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. భగత్‌సింగ్ ధైర్య, సాహసాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని మంత్రి అన్నారు. కాలనీ పేరు పెట్టడమే కాదు.. అందుకు తగిన గుర్తింపు ఉండేలా భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేసుకున్నందుకు కాలనీవాసులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్, మందలపు సాయిబాబు చౌదరి, శేరి సతీష్‌రెడ్డి, గంధం రాజు, తమ్మినేని ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం


టెంపుల్ బస్టాప్ వద్ద జనసేన జెండాను ఎగురవేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్

కూకట్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం కేపీహెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో టెంపుల్ బస్టాప్ వద్ద జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేయడంతోపాటు స్థానికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కోఆర్డినేటర్లు, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

లాక్రస్ చాంపియన్‌షిప్‌కు 19 మంది విద్యార్థులు


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన విద్యార్థులు

షాపూర్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ క్యాపిటల్ డిగ్రీ, పీజీ కాలేజీ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు జాతీయ స్థాయి లాక్రస్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక కావడం హర్షణీయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం ఎంపికైన విద్యార్థులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10న సికింద్రాబాద్‌లోని జింఖా నగర్‌లో తెలంగాణ లా క్రసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రాష్ట్రస్థాయి లా క్రసీ వర్క్ షాప్ శిక్షణా కార్యక్రమంలో జరిగిన లా క్రసీ ఆట విధానాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. ఈనెల 26న ఢిల్లీలో ఆగ్రా వద్ద నిర్వహించే జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌కు మద్దతు ఇవ్వాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌కు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో నావంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

షాపూర్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానం అని, రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారిని కాపాడిన వారమవుతామని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఈనెల 16న జీడిమెట్ల గ్రాస్పల్ చర్చి ఆవరణలో నిర్వహించనున్న రక్తదాన శిబిరానికి హాజరు కావాలని చర్చిపాస్టర్ శౌరి బొల్లోదు పాస్టర్‌లతో కలిసి ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రికను గురువారం అందజేశారు. ఈ శిబిరాన్ని తలసేమియా బాధితుల కోసం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జామవా, స్మృత్‌బాబు, ధర్మరాజు పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

లింగంపల్లిలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం

గచ్చిబౌలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి పాతగ్రామంలో చాలాకాలంగా అసంతృప్తిగా మిగిలిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, పూర్తయ్యేలా చూస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. గ్రామ డెవలప్‌మెంట్ ప్రతినిధి రవియాదవ్, స్థానికుల విజ్ఞప్తి మేరకు గురువారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ ప్రజా సౌకర్యార్థం రవియాదవ్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావిని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామచందర్, అశోక్, సుభాష్, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లేశ్, యాదగిరి, రాజారెడ్డి పాల్గొన్నారు.

'హరీష్‌రెడ్డి అనైతిక చర్యలను ఖండిస్తున్నాం'

కూకట్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి రాజీనామా చేసిన పన్నాల హరీష్‌రెడ్డి వ్యవహారశైలి, అనైతిక చర్యలను ఖండిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావుతోపాటు పార్టీ జిల్లా నాయకులు ప్రకటన విడుదల చేశారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలను అవకాశాలు పొందిన హరీష్‌రెడ్డి ఎంపీ బీజేపీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత పార్టీకి రాజీనామా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా కమిటీ, నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా పన్నాల హరీష్‌రెడ్డి వ్యవహరించారన్నారు. నైతిక విలువలు లేకుండా వ్యక్తిగత స్వలాభం కోసం పార్టీలు మారే హరీష్‌రెడ్డి లాంటి నాయకులకు ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ రోడ్‌షోను విజయవంతం చేయండి

బాలానగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించతలపెట్టిన ప్రధాని మోదీ రోడ్‌షోను విజయవంతం చేయాలని బీజేపీ బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు జీఆర్. రమేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం బాలానగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో బీజేపీజిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.